# అభివృద్ధిని చూసి బీఆర్ఎస్‌లోకి

- సీఎం కేసీఆర్ సంక్షేమ పథకాలే భారీ మెజార్టీతో గెలిపిస్తాయి
- క్యాసారం బీఆర్ఎస్‌కు కంచుకోట
- ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి



క్యాసారం కాంగ్రెస్ నాయకులను బీఆర్ఎస్‌లో చేర్చుకుంటున్న ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు, అక్టోబర్ 13 : అభివృద్ధిని చూసి బీఆర్ఎస్‌లో చేరుతున్నారని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని ఎమ్మెల్యే సమక్షంలో పటాన్‌చెరు మండలం క్యాసారం గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరారు. గులాబీ కండువాలు కప్పి ఎమ్మెల్యే వారిని పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు అన్ని పార్టీల్లోని ముఖ్య నాయకులను ఆకర్షిస్తున్నాయి.

పటాన్‌చెరు నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందాలంటే బీఆర్ఎస్‌ని భారీ మెజార్టీతో గెలిపించుకోవాలని కోరారు. తొమ్మిదేండ్ల కాలంలో తెలంగాణలో సీఎం కేసీఆర్ చేసిన అభివృద్ధి దేశమంతా కొనియాడుతున్నదన్నారు. అనేక అవార్డులు, రివార్డులు మన రాష్ర్టానికే వస్తున్నాయన్నారు. బీఆర్ఎస్‌లో పనిచేసే నాయకులకు, కార్యకర్తలకు గుర్తింపు ఉంటుందన్నారు.

కాంగ్రెస్ నుంచి రామచంద్రయ్య, శంకరయ్య, కిష్టయ్య, రాఘవేందర్, యాదయ్య, శ్రీనివాస్, ప్రభు బీఆర్ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ప్రభాకర్, ఈశ్వర్, శ్రీనివాస్, రమేశ్, ప్రభాకర్, మధుసూదన్‌రెడ్డి, శరణప్ప, సత్యనారాయణ, సుధాకర్, భూపాల్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

## పోలింగ్ కేంద్రాల పరిశీలన

కంది, అక్టోబర్ 13 : ఓటర్లకు ఇబ్బందులు లేకుండా పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లు చేయాలని ఎన్నికల అధికారి చంద్రశేఖర్ సూచించారు. శుక్రవారం కంది మండలంలోని పోలింగ్ కేంద్రాలను ఆయన పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు సరిపడే విధంగా గదులు, లైటింగ్, ర్యాంపు సౌకర్యం తదితర వాటిని పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల వద్ద ర్యాంపులు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని, కనీస సౌకర్యాలు కల్పించాలన్నారు. పోలింగ్ సక్రమంగా నిర్వహించేందుకు సౌకర్యాలను కల్పించేందుకు పోలింగ్ కేంద్రాలను సందర్శించి పలు సూచనలు, సలహాలు చేస్తున్నట్లు ఎన్నికల అధికారి తెలిపారు. కార్యక్రమంలో బీఎల్వోలు విద్యాధర్‌గౌడ్, కిరణ్, పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.




కంది జడ్పీహెచ్ఎస్‌లోని పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎన్నికల అధికారి చంద్రశేఖర్

## సమావేశానికి తరలిన నాయకులు

గుమ్మడిదల, అక్టోబర్ 13 : పటాన్‌చెరు నియోజకవర్గంలోని జీఎంఆర్ కన్వెన్షన్‌హాల్‌లో జరిగే బీఆర్ఎస్ నియోజకవర్గ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశానికి గుమ్మడిదల మండలం నుంచి నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివెళ్లారు. శుక్రవారం మండలంలోని పలు గ్రామాల నుంచి గ్రామస్థాయి నాయకులు, కార్యకర్తల నుంచి మండలస్థాయి నాయకులు, కార్యకర్తలు, వివిధ విభాగాల నాయకులు భారీ సంఖ్యలో బీఆర్ఎస్ సమావేశానికి తరలి వెళ్లారు. సమావేశంలో అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించే విధంగా దిశానిర్దేశం చేయనున్నట్లు జడ్పీటీసీ కుమార్‌గౌడ్, ఎంపీపీ సద్దిప్రవీణా విజయభాస్కర్‌రెడ్డి, నాయకులు తెలిపారు.



గుమ్మడిదల మండల కేంద్రం నుంచి పటాన్‌చెరుకు వెళ్తున్న బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు

## మున్నూరుకాపులకు సముచిత గౌరవం కల్పించాలి

**మున్నూరుకాపు సంఘం జిల్లా అధ్యక్షుడు యాదగిరి**

రామచంద్రాపురం, అక్టోబర్ 13 : మున్నూరుకాపులకు రాజకీయ పార్టీలు సముచిత గౌరవం కల్పించాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు యాదగిరి, మున్నూరుకాపు సంఘం ఫౌండర్ విష్ణుమూర్తి అన్నారు. శుక్రవారం ఆర్సీపురం డివిజన్‌లోని మున్నూరుకాపు సంఘం కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జనాభాలో 25శాతం ఉన్న మున్నూరు కాపులకు అదే నిష్పత్తిలో అసెంబ్లీ, పార్లమెంట్ టికెట్లు కేటాయించాలన్నారు.

ప్రభుత్వం ఏర్పడిన వంద రోజుల్లో మున్నూరుకాపు కార్పొరేషన్ ఏర్పాటు చేయాలన్నారు. వ్యవసాయమే ప్రధాన జీవనాధారంగా ఉన్న మున్నూరుకాపులకు ప్రత్యేకంగా సంక్షేమ పథకాలు అమలు చేయాలని చెప్పారు. నామినేటెడ్ పోస్టుల్లోనూ ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. దశాబ్దాలుగా మున్నూరుకాపులను రాజకీయ పార్టీలు కేవలం ఓటు బ్యాంకుగా మాత్రమే వాడుకుంటున్నాయని, రాబోయే ఎన్నికల్లో సరైన ప్రాధాన్యత కల్పించాలని డిమాండ్ చేశారు.

తమ డిమాండ్‌లకు ఏ రాజకీయ పార్టీ ప్రాధాన్యత ఇస్తుందో ఆ పార్టీకే మున్నూరుకాపులు మద్దతు తెలుపుతారన్నారు. సమావేశంలో సంఘం సభ్యులు మోహన్, ప్రవీణ్, ప్రశాంత్, నవీన్, సూర్యచందర్ రావు, రవణంప్రసాద్, గణపతిరావు, వెంకటేశ్వర్లు, రాందాస్ ఉన్నారు.



సమావేశంలో నినాదాలు చేస్తున్న మున్నూరుకాపు సంఘం జిల్లా అధ్యక్షుడు యాదగిరి

## మున్సిపల్ కార్మికులకు రాగి మాల్ట్ పంపిణీ

సంగారెడ్డి కలెక్టరేట్, అక్టోబర్ 13 : సత్యసాయి అన్నపూర్ణ ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణ మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులకు రాగిమాల్ట్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ జిల్లా కో-ఆర్డినేటర్ శ్యాంప్రసాద్ మాట్లాడుతూ సంగారెడ్డి మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులు 250మందికి 250కేజీల రాగి మాల్ట్‌ను ఉచితంగా అందించామన్నారు. రాగిమాల్ట్ ద్వారా అవసరమైన పోషక విలువలు లభిస్తాయన్నారు. సమాజ సేవ చేస్తున్న కార్మికులందరూ ఆరోగ్యంగా ఉండాలనే ఈ రాగి మాల్ట్ అందజేయడం జరుగుతుందన్నారు. ఇప్పటి వరకు జిల్లాలోని వివిధ ప్రభుత్వ హాస్టళ్ల విద్యార్థులకు ఈ రాగి మాల్ట్ అందించామని గుర్తు చేశారు. కార్యక్రమంలో నరహరి, దేవేందర్, శ్రీనివాస్, రాజేశ్‌కుమార్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



మున్సిపల్ కార్మికులకు రాగి మాల్ట్ అందజేస్తున్న సత్యసాయి అన్నపూర్ణ ట్రస్ట్ జిల్లా కో-ఆర్డినేటర్ శ్యాంప్రసాద్

## దుర్గాదేవి ఉత్సవాల్లో భజన పోటీలు

గుమ్మడిదల, అక్టోబర్ 13: దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాల్లో భజన పోటీలను నిర్వహిస్తున్నట్లు దుర్గామాత ఉత్సవకమిటీ అధ్యక్షుడు తెలిపారు. మండలంలోని బొంతపల్లిలో 15వ తేదీ నుంచి ప్రారంభమయ్యే నవరాత్రోత్సవాల్లో భాగంగా ఈ నెల 19న దుర్గామాత మండప ప్రాంగణంలో భజన పోటీలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న భజన కమిటీల వారు, ముందుగా పేర్లు నమోదు చేసుకోవాలని ఉత్సవకమిటీ అధ్యక్షుడు లచ్చయ్య తెలిపారు. ఈ పోటీల ప్రారంభోత్సవానికి ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు నీలం మధుముదిరాజ్, ఎన్‌డీఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు దేవేందర్‌రాజు, జడ్పీటీసీ కుమార్‌గౌడ్, ఎంపీపీ సద్దిప్రవీణాభాస్కర్‌రెడ్డి ప్రముఖులు హాజరుకానున్నారని తెలిపారు. భజన పోటీలో పాల్గొనే భజన సంఘాల వారు ముందుగా 9490674726కు సమాచారం ఇచ్చి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

## దేవి నవరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు

రామచంద్రాపురం, అక్టోబర్ 13 : దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలకు సంబంధించి నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆదివారం నుంచి దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఇప్పటికే అమ్మవారి ఆలయాలను విద్యుత్‌లైట్లతో అలంకరించి ముస్తాబు చేశారు. అమ్మవారి విగ్రహాలను ప్రతిష్ఠించే నిర్వాహకులు ఆయా ప్రాంతాల్లో ఇప్పటికే మండపాలను సిద్ధం చేశారు. ఆదివారం నుంచి 23వ తేదీ వరకు అమ్మవారి నవరాత్రి ఉత్సవాలు జరుగనున్నాయి. నిత్యం అమ్మవారు ప్రత్యేక పూజలు అందుకోనున్నది. ఈ మేరకు ఆలయ పూజారులు, నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. మల్లికార్జుననగర్ కాలనీలో 16సంవత్సరాలుగా ప్రతిఏటా దుర్గాభవానీ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అమ్మవారిని ప్రతిష్ఠించి వేడుకలను నిర్వహిస్తున్నారు.

## ఘనంగా బతుకమ్మ సంబురాలు




బతుకమ్మ ఆడుతున్న అధ్యాపకులు, విద్యార్థినులు

సంగారెడ్డి కలెక్టరేట్, అక్టోబర్ 13: తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ పండుగ అని తారా ప్రభుత్వ డిగ్రీ, పీజీ అటానమస్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేఎస్ఎస్ రత్నాప్రసాద్ పేర్కొన్నారు. శుక్రవారం కళాశాల కల్చరల్ క్లబ్, ఎన్ఎస్ఎస్ విభాగాలు, కామర్స్, వృక్షశాస్త్ర విభాగం సంయుక్త ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చి ప్రత్యేక పూజలు చేశారు. మహిళా అధ్యాపకులు, విద్యార్థినులు బతుకమ్మ ఆటలు ఆడుతూ సంబురాలు చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ 9రోజుల పాటు మహిళలు ప్రత్యేక పూజలతో బతుకమ్మ వేడుకలు చేసుకుంటారని వివరించారు. ప్రకృతిలో లభించే వివిధ పూలతో పేర్చే బతుకమ్మను లక్ష్మీ, పార్వతీ, సరస్వతి దేవతల స్వరూపాలుగా చెబుతారని తెలిపారు. బతుకమ్మ పండగను రాష్ట్ర పండుగా జరుపుకొంటామని గుర్తు చేశారు.

బతుకమ్మకు వెయ్యి సంవత్సరాలకు పైగా చరిత్ర ఉన్నదన్నారు. అనంతరం విద్యార్థుల డప్పు వాయిద్యాలతో బతుకమ్మలను నిమజ్జనానికి ఊరేగింపుగా తీసుకెళ్లారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాళ్లు ప్రవీణ, డాక్టర్ వెంకటేశం, కల్చరల్ క్లబ్ కన్వీనర్ సంతోషి, ఎన్ఎస్ఎస్ అధికారులు డాక్టర్ పద్మజ, శివదీప్తి, డాక్టర్ విజయ, డాక్టర్ జోత్స్న, వాణి, శ్రావణి, అన్నపూర్ణ, సుగుణావతి, తదితర మహిళా అధ్యాపకులు, విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

**తెలంగాణ సంప్రదాయాలకు బతుకమ్మ ప్రతీక**

సదాశివపేట, అక్టోబర్ 13 : తెలంగాణ సంస్కృతి సాంప్రదాయలకు బతుకమ్మ ప్రతీక అని మున్సిపల్ చైర్ పర్సన్ పిల్లోడి జయమ్మ అన్నారు. శుక్రవారం పట్టణంలోని శాంతినికేతన్ పాఠశాలలో నిర్వహించిన బతుకమ్మ వేడుకలకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గౌరమ్మ పూజ చేసి బతుకమ్మ సంబురాలను ప్రారంభించారు. చిన్నారులు బతుకమ్మ పాటలపై నృత్యాలు చేస్తూ సంబురాలు జరుపుకొన్నారు.

## ఘనంగా ఐక్యూఏసీ వారోత్సవాలు

సంగారెడ్డి కలెక్టరేట్, అక్టోబర్ 13 : కళాశాలలో అత్యున్నత ప్రమాణాలను అందించేందుకు ఇంటర్నల్ క్వాలిటీ అస్యూరెన్స్ సెల్ (ఐక్యూఏసీ) గొప్పగా పని చేస్తున్నదని తారా ప్రభుత్వ డిగ్రీ, పీజీ అటానమస్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేఎస్ఎస్ రత్నాప్రసాద్ పేర్కొన్నారు. శుక్రవారం కళాశాల సెమినార్ హాలులో ఐక్యూఏసీ స్నాతకోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ కళాశాలలో 2006లో అక్టోబర్ 13న ఐక్యూఏసీ స్థాపించమన్నారు. కళాశాల నిర్వహణలో భాగంగా ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించమన్నారు. ఈ క్రమంలోనే ఇటీవల న్యాక్ ఏ ప్లస్ గ్రేడ్ సాధించుకోవడం కళాశాలకే గర్వకారణమన్నారు. అనంతరం ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ఐక్యూఏసీ కో-ఆర్డినేటర్‌ను సన్మానించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాళ్లు ప్రవీణ, డాక్టర్ వెంకటేశం, ఐక్యూఏసీ కో-ఆర్డినేటర్ విశ్వేశ్వరశర్మ, ఎన్ఎస్ఎస్ అధికారులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ప్రభుత్వ మహిళా కళాశాల ఐక్యూఏసీ కో-ఆర్డినేటర్‌ను సన్మానిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు